క్లుప్తంగా

7 నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం

మహారాణిపేట: నేటి స్పీడ్ యుగంలో విద్యార్థులు, ఉద్యోగులు, వయోవృద్ధులు మానసిక ఒత్తిడికి లోనై అనేక రుగ్మతల పాలిట పడుతున్నారు. క్షణికావేశంలో పొరపాట్లు చేస్తున్నారు. ఒత్తిడి నివారణకు యోగా చేయాలని ప్రకృతి చికిత్సాలయం యోగ సాధకురాలు డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి అందరికీ ఉచితంగా యోగాలో శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. బీచ్‌రోడ్డులో ఉన్న ప్రకృతి చికిత్సాలయంలో ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. వయోభేదం లేకుండా స్త్రీ, పురుషులు, విద్యార్థులు అందరికీ ఉచితంగా నెల రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డాక్టర్ శ్రీలక్ష్మి కోరారు. ఔత్సాహికులు గోకుల్ పార్కు ఎదురు రోడ్డు, బుద్దవరపు గార్డెన్స్, మహారాణిపేటలో గానీ 9866077307 నంబర్లో గానీ సంప్రదించాలన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ లండా రమణ, సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ జీడీ బాబు

డాబాగార్డెన్స్: పాతనగరంలో రౌడీషీటర్లకు వన్‌టౌన్ సీఐ జీడీ బాబు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రజా శాంతికి భంగం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని, పీడీ యాక్ట్ నమోదు చేస్తామని రౌడీషీటర్లను ఆయన హెచ్చరించారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు లక్ష్మి మృతి



మహారాణిపేట: దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గంలో సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు బోధల లక్ష్మి ఆదివారం మృతి చెందారు. ఆమె గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వెలంపేట ఏరియాలో నివసిస్తున్న ఆమె గతంలో కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా ఉండేవారు. దివంగత మాజీ ఎమ్మెల్యేలు ఈటి విజయలక్ష్మి, ద్రోణంరాజు సత్యనారాయణ, ద్రోణంరాజు శ్రీనివాస్‌కు లక్ష్మి సుపరిచితురాలు. ఆమె మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

గురుకుల ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధనపై శిక్షణ

సీతంపేట: ఆంగ్ల ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం పెంపొందించే దిశగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం శంకరమఠం రోడ్డులోని ఒక హోటల్‌లో ప్రారంభించింది. ఈ సందర్భంగా సొసైటీ డీసీవో డాక్టర్ సి.ప్రభావతమ్మ మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ బోధించేందుకు ముంబైకి చెందిన కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌తో ఎంవోయూ చేసుకున్నట్టు తెలిపారు. మూడు రోజుల శిక్షణ ఉంటుందన్నారు. ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, నూతన్, ఫర్జిత్ పంతక్, జ్యోతి శిక్షణ ఇచ్చారు.

- నేరాల పట్ల అప్రమత్తం అంటున్న పోలీసులు
- వేసవి సెలవుల నేపథ్యంలో ప్రజలకు అవగాహన
- ఎల్ఎంహెచ్ఎస్ యాప్ వినియోగించుకోవాలని సూచన



టూటౌన్‌లోని ఒక అపార్టుమెంట్ వాసులకు నేరాలపై అవగాహన కల్పిస్తున్న క్రైం పోలీసులు



ఊరెళ్తున్నారా.. జర భద్రం



అల్లిపురం: స్కూళ్లు, కాలేజీలకు వేసవి సెలవులు వచ్చాయంటే చాలు సొంత గ్రామాలకు వెళ్లాలని పిల్లలు, పెద్దవాళ్లు ఆసక్తి చూపుతారు. ఏడాదిలో ఎక్కువ రోజులు సెలవులు వచ్చేది వేసవిలోనే. దీంతో అమ్మమ్మ, నానమ్మ ఊళ్లకు వెళ్లాలని అంతా అనుకుంటారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం చూపిస్తుంటారు. సొంత ఊళ్లకు వెళ్లే తొందరలో అజాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు. కాస్త నిఘా ఉంచమని చుట్టుపక్కల వారికి కూడా చెప్పకుండా వెళ్లిపోతుంటారు. పోలీసులకు కూడా సమాచారం అందజేయరు. ఈ నేపథ్యంలో పోలీసులు నేరాల నియంత్రణ పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌ను ఉపయోగించుకోండి..

తాళం పడితే చాలు.. దొంగలు కన్నం వేస్తారు. చెమటోడ్చి దాచుకున్న డబ్బుని క్షణాల్లో దోచుకెళ్లిపోతారు. ఇల్లు విడిచి బయట అడుగు పెట్టాలంటే ఇక భయపడాల్సిన అవసరం లేదు. సాంకేతిక సాయంతో.. చోరీలకు చెక్ చెప్పే ఆధునిక వ్యవస్థను పోలీస్‌లు నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. పోలీసు శాఖ రూపొందించిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌ను ప్రజలు తమ మొబైళ్లలో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ అవ్వాలి. ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళ్లే ముందు ఈ యాప్ సహాయంతో పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో పోలీసులు మీ ఇంటి దగ్గర టెక్నాలజీ సహాయంతో భద్రత కల్పిస్తారు. ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఇందులో రిజిస్టర్ అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకుని అందులో ఇంటి అడ్రస్, సెల్ నంబర్ పొందుపరచాలి. రిజిస్టర్ చేసుకున్నాక అందులో ఇచ్చిన నంబర్‌కు వన్ టైం పాస్‌వర్డ్, యూజర్ ఐడీ వస్తాయి. ఎప్పుడైనా ఊరికి వెళ్లినప్పుడు ఈ యాప్‌లోకి వెళ్లి యూజర్ ఐడీని టైప్ చేసి రిక్వెస్ట్ పోలీస్ వాచ్ ద్వారా సమాచారం ఇవ్వాలి. ఫలానా తేదీల్లో ఇంట్లో ఉండటం లేదని సమాచారం టైప్ చేసి సబ్‌మిట్ చెయ్యాలి. సమాచారం అందుకున్న తర్వాత పోలీసులు ఊరికి వెళ్లే ముందు రోజున మీ ఇంటికి వచ్చి వైర్‌లెస్ మోషన్ సీసీ కెమెరాలు, మోడెమ్ మొదలైన పరికరాలు బిగించి వెళ్తారు. అప్పటి నుంచి మీ ఇల్లు పోలీస్ నిఘాలో ఉంటుంది. ఒకవేళ దొంగలు వచ్చి తాళం పగలగొట్టేందుకు ప్రయత్నిస్తే.. అక్కడున్న కెమెరాలో అలారం మోగుతుంది. ఆ సమాచారం వెంటనే పోలీసులకు అందుతుంది. మీరు లేని సమయంలో ఎవరైనా ఇంటికి వస్తే ఆ వీడియోలు, ఫొటోలు సీసీ కెమెరాల సహాయంతో పోలీస్ కంట్రోల్ రూంకి చేరుతాయి. ఇవన్నీ ఈ యాప్‌తోనే సాధ్యమవుతాయి. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని పోలీసులు కోరుతున్నారు.

ఇల్లు వదిలి వెళ్లే సమయంలో..

- ఇంటి చిరునామా, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియపరచాలి. ఎప్పుడు ఊరు వెళ్తున్నదీ, ఎప్పుడు తిరిగి వస్తున్నదీ తేదీలతో పాటు చెప్పాలి. ఇంటి యజమాని ఫోన్ నంబరు అందజేయాలి. లేదా వాచ్‌మెన్‌ను నియమించాలి.
- అపార్టుమెంట్లలో ఉన్న వారు వాచ్‌మెన్‌ను తప్పకుండా నియమించుకోవాలి. వాచ్‌మెన్ ఫొటో, అడ్రస్ తీసుకోవాలి. అపార్ట్‌మెంట్‌లోకి కొత్త వారు వచ్చేటప్పుడు వాచ్‌మెన్‌తో వారిని ప్రశ్నింపజేయాలి. రిజిస్టర్‌లో వారి పేరు, అడ్రస్, ఫోన్ నంబరు, ఎక్కడికి వెళ్తున్నదీ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలి.
- అపార్ట్‌మెంట్ సెల్లార్ లోను, ప్రవేశ ద్వారం, కారిడార్‌లోను సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లలో ఎక్కువ మొత్తంలో సొమ్ము, బంగారం, వెండి ఆభరణాలు ఉంచరాదు. బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి.
- ప్రయాణాల్లో విలువైన వస్తువులు బ్యాగుల్లో పెట్టకండి. జాగ్రత్తగా భద్రపరుచుకోండి. చిన్నపిల్లలను, బ్యాగులను ఎక్కడ పడితే అక్కడ వదిలిపెట్టి వెళ్లకండి.

LHMS AP Police

నేరాల పట్ల అప్రమత్తం..



వేసవి సెలవులకు సొంత గ్రామాలకు వెళ్లే వారు తప్పకుండా తమ సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌లో అందజేయాలి. లేదా ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఉపయోగించుకోవాలి. నగదు, బంగారు వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అత్యవసరమైనప్పుడు డయల్ 100, 1090 నంబర్లకు గాని, టూటౌన్ 0891–2783672, మహారాణిపేట 0891–2746866 నంబర్లకు గానీ ఫిర్యాదు చేయండి.

– సీహెచ్ రాజులనాయుడు, ఈస్ట్ క్రైం సీఐ

విద్యార్థులకు ఆటల పోటీలు



గ్రంథాలయంలో సందడి చేస్తున్న విద్యార్థులు

అల్లిపురం: వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణలో భాగంగా అల్లిపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అంతకు ముందు విద్యార్థులు గ్రంథాలయంలో జీకే తదితర పుస్తకాలు చదివి ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, పాఠకులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

25న మిరాకిల్ టాలెంట్ పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిన్నారులు, అతిథులు

డాబాగార్డెన్స్: మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 25న మిరాకిల్ టాలెంట్ ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు, కొరియోగ్రాఫర్ మహ్మద్ షకీల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్ చిన్నారులచే పోస్టర్ ఆవిష్కరించి, పోటీల వివరాలు వెల్లడించారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఆ రోజు ఉదయం 9.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. క్లాసికల్, వెస్ట్రన్ డ్యాన్స్, సింగింగ్, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫోక్ డ్యాన్స్, డ్రాయింగ్, పెయింటింగ్, గెటప్స్, డైలాగ్స్, ట్రెడిషనల్, ఫ్యాన్సీ డ్రెస్ తదితర పోటీలు ఉంటాయని, అన్ని వయసుల వారు అర్హులేనని చెప్పారు. పోటీలో పాల్గొనదలిచే వారు 9966485335, 95533 33134 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పేద విద్యార్థి చదువుకు వాసుపల్లి చేయూత



ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: నిరుపేద విద్యార్థి పంపాన సుహాస్ ఫీజు నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ మంచి రోజులు వస్తాయని, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేతకాని పాలన ఇప్పటికే ప్రజలకు అర్థమయ్యిందన్నారు. ప్రజలు సంతోషంగా ఉండాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ రావాలని వాసుపల్లి ఆకాంక్షించారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, మాజీ కార్పొరేటర్, విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి పద్మనాభం అమ్మాజీ, పార్టీ నాయకులు గుర జాపు రవి, నీలాపు సర్వేశ్వరరెడ్డి, పీతల వాసు, ముత్తాబత్తుల రమేష్, ముజీబ్‌ఖాన్, సువార్త రాజు, రాజుపాత్రుడు, బెవర మహేష్, సూర్యనాయుడు, ఎర్నిమాంబ గుడి చైర్మన్ లండా రమణ, కృష్ణకుమార్‌రెడ్డి, కృష్ణంరాజు, సాగర్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

డాబాగార్డెన్స్: అఖిల పక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన ఈనెల 20వ తేదీ దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. లేబర్‌కోడ్‌లు వస్తే సంఘం పెట్టుకునే హక్కు పోతుందన్నారు. చెన్నైలోని సామ్‌సంగ్ కంపెనీలో కార్మికులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న యూనియన్‌ను రిజిస్టర్ చేయకుండా యాజమాన్యం, ప్రభుత్వం అడ్డుకున్నాయన్నారు. లేబర్‌కోడ్ అమల్లోకి వస్తే కార్మికులు ఏ కష్టం వచ్చినా సమస్య పరిష్కారానికి సమ్మె చేయలేరని, అలా చేస్తే ఒక రోజు సమ్మెకు 8 రోజుల వేతనం కోల్పోతారన్నారు. నాయకులను జైల్లో పెట్టి నిర్బంధించవచ్చని, యూనియన్ రిజిస్ట్రేషన్, గుర్తింపు రద్దు చేయవచ్చని, లక్షలాది రూపాయల జరిమానా విధించవచ్చన్నారు. మరోవైపు ఇప్పటి వరకు కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ చెల్లించని యజమానులకు జైలు శిక్ష పడేదని, దానికి భయపడి కట్టేవారన్నారు. యజమానులు జైలుకెళ్తే బెయిల్ రావాలంటే 50 శాతం చెల్లించాల్సి ఉండేదన్నారు. కానీ లేబర్ కోడ్‌లో యజమానుకు ఈ శిక్షలు ఎత్తివేశారన్నారు. కార్మికుల పాలిట శాపంగా మారే లేబర్‌కోడ్ల రద్దుకు పోరుబాట పట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రమణబాబు, సురేష్, హెచ్ఎంఎస్ నాయకుడు మంగయ్య నాయుడు, సిటు గౌరవ అధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు, త్రినాథరావు, వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మణరావు, సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు కనకారావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు బి. వెంకట్రావు, సిటు కార్యదర్శి బి. జగన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటీకరణను ప్రతిఘటించాలి

డాబాగార్డెన్స్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్త సమ్మెకు ఇంటర్నేషనల్ ట్రేడ్ యూనియన్ కాన్ఫడరేషన్ (ఐటీయూసీ) అనుబంధ కాన్ఫడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ ఇండియా (సీఎఫ్‌టీయూఐ) సిద్ధమైనట్టు సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని మోదీ, కార్మిక, ఉపాధి శాఖమంత్రి డాక్టర్ మన్సుఖ్‌ఎల్ మాండవీయకు లేఖ పంపినట్టు పేర్కొన్నారు. ప్రజల ఉనికికి ముప్పుగా మారుతున్న కార్పొరేటీకరణను ప్రతిఘటించడమే సమ్మె ముఖ్యోద్దేశంగా పేర్కొన్నారు. దేశంలోని కార్మికులు, రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం, ఉద్యోగావకాశాల కొరత, ప్రజల జీవనోపాధిపై కార్పొరేట్‌కు అనుకూలమైన ప్రభుత్వ విధానాలు లక్షలాది మందిని పేదరికంలోకి నెట్టివేయబడ్డాయన్నారు. అసంఘటితరంగ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, స్కీమ్ వర్కర్లతో సహా కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస పెన్షన్ రూ.9 వేలు, అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులతో సహా అన్ని వర్గాల కార్మికులకు సామాజిక భద్రత, గృహ ఆధారిత కార్మికులు, హ్యాకర్లు, రాగ్ పిక్కర్లు, గృహ కార్మికులు, నిర్మాణ రంగ కార్మికులకు భద్రత, కనీస వేతనం అందజేయాలని మోదీకి పంపిన లేఖలో పేర్కొన్నారు.

అలరించిన వినోదాల విందు



స్కిట్ ప్రదర్శిస్తున్న ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ సభ్యులు

సీతంపేట: ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వినోదాల విందు పేరిట ప్రదర్శించిన కామెడీ స్కిట్లు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సభ్యులు జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజు, గణేష్, కుమారి, పుష్పమి, గోపీకృష్ణ, జీవీ లక్ష్మి, నరసింగరావు, నిరోషా ప్రదర్శించిన స్కిట్లు అలరించాయి. వీటిలో జడ్జిమెంట్, స్లిప్, హింస, సబ్బవరం, చల్లగా ఉండు, డాక్టర్ పేషెంట్, ఛానల్ ఓపెన్ అయ్యింది, సూర్య నమస్కారాలు, ఓటీపీ, పొదుపు, పచ్చడి నాటికలు ఆహుతులను నవ్వుల్లో ముంచెత్తాయి. ఈ సందర్భంగా అల్లు వెంకటరమణ శిష్యులు అనూష, అనన్య, పింకీ శాస్త్రీయ నృత్యంతో అలరించారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు పంపిణీ చేస్తున్న రాగం కిషోర్

కంచరపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైజాగ్ సీ–పోర్ట్ వైస్ చైర్మన్, పినాకిల్ ఎండీ రాగం కిషోర్ పేర్కొన్నారు. జ్ఞానాపురం పరిధిలో రంజిత్ కుమార్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత డాక్టర్ దాసరి బుజ్జి నేతృత్వంలో ఆదివారం మొక్కల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరికి ఒక మొక్క అనే నినాదంతో మొక్కలు అందజేశారు. ముందుగా చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ రాపాక యాదవ్, కొయిలాడ శ్రీనివాసరావు, సుభాషిణి, పద్మ, భవిత, ఉమా, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల సందడి



స్కూల్ యూనిఫాంలో సెయింట్ పీటర్స్ పూర్వ విద్యార్థులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ బాలుర ఉన్నత పాఠశాలలో 2000–01 సంవత్సరానికి చెందిన టెన్త్ విద్యార్థులు ఆదివారం భీమిలిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఉత్సాహంగా గడిపి పాత అనుభూతులను పంచుకున్నారు. 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో తమ పాఠశాలలో చిన్ననాటి సంఘటనలు, జ్ఞాపకాలు పంచుకున్నారు. పాఠశాల లోగోతో కూడిన యూనిఫాం ధరించి ఆనందం వ్యక్తం చేశారు. తమ జీవితాలను మార్చిన ఉపాధ్యాయులకు ఎంతో రుణపడి ఉంటామని తెలిపారు.

మౌల్డింగ్ ఆర్ట్‌పై శిక్షణ



మౌల్డింగ్ ఆర్ట్‌ను ప్రదర్శిస్తున్న చిన్నారులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం మౌల్డింగ్ ఆర్ట్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణలో సీనియర్ వాకర్ పొందూరు సూర్యనారాయణ విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. కళలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఖాళీ సమయంలో తమకు నచ్చిన కళలో ప్రవేశం పొంది సాధన చేయాలన్నారు. చిత్రలేఖనం వల్ల ఉన్నత భావాలు ఏర్పడుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము తయారు చేసిన చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, సహాయ కార్యదర్శి ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.

కూటమి హామీలన్నీ అబద్ధాలే

- జగన్ పాలన కోసం ఎదురు చూస్తున్న ప్రజలు
- 41వ వార్డు కార్పొరేటర్ పూర్ణిమకు ఘన సత్కారం



కార్పొరేటర్ పూర్ణిమను సత్కరిస్తున్న వార్డు ప్రజలు

కంచరపాలెం: అధికారం కోసం అమలు కాని హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ అన్నారు. ఇటీవల జరిగిన మేయర్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసి వైఎస్సార్‌సీపీకి దన్నుగా నిలిచిన పూర్ణిమను వార్డు ప్రజలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల ప్రభుత్వం అంటే వైఎస్సార్‌సీపీ మాత్రమేనని అన్నారు. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలు ఎంతో సంతోషంగా ఉండేవారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో సంక్షేమం అందక, ప్రజలను దోపిడీ చేసే రాజ్యం వచ్చిందని ఆరోపించారు. ప్రజలు మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన కోరుకుంటున్నారని వెల్లడించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కనీసం ప్రజల సమస్యలు, అభివృద్ధి పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్‌కుమార్ నిరంతరం ప్రజలతో ఉండి, ప్రజాదర్బార్ల ద్వారా సమస్యలు పరిష్కరించే వారని పేర్కొన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి విశాఖ మేయర్ పదవి వైఎస్సార్‌సీపీ ఖాతాలో పడేటట్లు కృషి చేద్దామని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం వార్డు మహిళలకు చీరలు, మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్‌ను వార్డు ప్రజలు ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు వేశంగిరిరావు, లక్కోజి కుమార్, పాత్రపల్లి సునీల్‌కుమార్, ఆనంద్‌రావు, దాలిబాని మధు, ధనాల రాజా, మురళి, రాజాన శ్రీను, సాయి, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తేజం నింపిన మేడే సాంస్కృతికోత్సవాలు



అతిథులకు మొక్కలు బహూకరిస్తున్న చిన్నారి

డాబాగార్డెన్స్: మే డే సాంస్కృతికోత్సవాలు ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఘనంగా నిర్వహించారు. ముందుగా కేంద్రం ఇన్‌చార్జి జీఎస్ రాజేశ్వరరావు కేంద్రం లక్ష్యాన్ని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ థియేటర్ ఆఫ్ ఆర్ట్స్ విభాగాధిపతి భాస్కరరావు మాట్లాడారు. కళల ప్రాశస్త్యాన్ని వివరిస్తూ.. కళల్లేని జీవితాన్ని ఊహించుకోవడం కష్టమన్నారు. ప్రతి ఒక్కరూ తమ కళల్ని ప్రదర్శించే అవకాశం కల్పించిన కేంద్రం నిర్వాహకుల్ని అభినందించారు. విశాఖ బాలోత్సవం అధ్యక్షుడు రఘు మాట్లాడుతూ ప్రముఖ నాయకుల సూక్తులు ఉటంకిస్తూ, వారు చెప్పిన మార్గంలో పయనించేటట్టు ఈ రోజు ఈ కార్యక్రమాలు ఉండాలని, పిల్లలు మొబైల్ ఫోన్లకు, ల్యాప్‌టాప్‌లకు అతుక్కుపోవడం వల్ల సృజనాత్మక శక్తి క్షీణిస్తుందన్నారు. ఎల్‌ఐసీ ఉద్యోగుల పూడే డ్యాన్స్ రూపకంతో పాటు స్వర్ణ కూచిపూడి, శివ క్లాసికల్, బ్యాడ్ బాయ్స్ వంటి డ్యాన్స్ అకాడమీల నృత్య రూపకాలు ప్రదర్శించారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, డాక్ యార్డ్ ఉద్యోగులు సేఫ్టీపైన లఘు నాటికలు ప్రదర్శించగా, ఎల్ఐసీ కాంట్రాక్ట్ ఉద్యోగులు మేడే పాటపై నృత్య రూపకం ప్రదర్శించారు. రాజరాజేశ్వరి దళం కోలాటం ప్రదర్శించింది. రైల్వే మహిళా ఉద్యోగి చిన్న మరియమ్మ సినీ దేశ భక్తి గేయాలు ఆలపించారు. ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగి శేఖర్ ఫ్లూట్‌పై దేశభక్తి గేయాన్ని ఆలపించారు. ఫ్రాన్సిస్, ప్రసాద్, బసు పోతన, సంతోషం, లలిత కవితలు వినిపించారు. మొత్తం 64 కళారూపాలు ప్రదర్శించారు. గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమణ, విశాఖ పౌర గ్రంథాలయ సేవా సంస్థల అధ్యక్షుడు బీఎల్ నారాయణ, ఎల్ఐసీ ఏజెంట్ రమణ, కోటేశ్వరరావు, బుజ్జి, ఎల్లాజీ, సత్యనారాయణ, సతీష్, చిత్రకళా పరిషత్ అధ్యక్షుడు సుంకర చలపతిరావు, డాక్టర్ విజయవేణి, ఒమ్మి అనిల్ కుమార్, ఎస్. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం శాశ్వత అన్న ప్రసాద పథకానికి విశాలాక్షినగర్‌కు చెందిన సుంకర శ్రీరాములు దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. అధికారులు దాతకు బాండ్ అందజేసి స్వామి వారి దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.